## సీఎం, డెప్యూటి సీఎం చిత్రపటాల బహుకరణ

**విశాలాంధ్ర - పలాస :** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ 10 వార్డ్ సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరియు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలను బుధవారం పలాస నియోజకవర్గం జనసేన నాయకులు హరీష్ కుమార్ శ్రీకాంత్ సచివాలయం సిబ్బందికి అందజేశారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ముఖ్యమంత్రి మరియు ఉప ముఖ్య మంత్రి ఫోటోలు ఉండాలని ఆదేశించిన సంగతి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గిరీష్, శ్రీకాంత్, సతీష్,అజయ్, నరేందర్, జగదీష్, శంకర్, ప్రశాంత్, వినోద్, కుర్మరావు, శేఖర్, ధనుం జయ, పవన్, పత్తి ఉదయ్‌కిరణ్‌లు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్, నిత్యవసర ధరలు తగ్గించాలి

**విశాలాంధ్ర - టెక్కలి :** పెట్రోల్, డీజిల్, నిత్యవసర ధరలు తగ్గించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు పెరిగిన నిత్యవసర వస్తువులు ధరలపై 1వ తేదీ నుంచి 6వ తేదీ వరకు జరిగే ప్రచార, నిరసన కార్యక్రమాలకు సంబంధించి వాల్ పోస్టర్ ను బుధవారం మండల కేంద్రంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం యుగంధర్ విడుదల చేశారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని, కూరగాయల ధరలు కూడా ఆకాశాన్ని తాకుతున్నాయని అన్నారు. ధరలు నియంత్రణ లేకపోవడంతో పేద, సామాన్య,మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనేకసార్లు పెంచి సామాన్య ప్రజలకు అవస్థలకు గురి చేసిందని అన్నారు. జనజీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్న అధిక ధరలను అరికట్టి, పెరిగిన ధరలను తగ్గించాలన ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు సామాన్యుల జీవితాల గురుంచి ఆలోచించాలని, వాళ్ళు సంపాదించే రోజు కూలి పెరిగిన ధరలకే సరిపోవడం లేదు, కబట్టి ప్రభుత్వాలు సామాన్యుల గురించి ఆలోచించి నిత్యావసర ధరలు తగ్గించాలని అన్నారు. పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని, ధరల స్థిరీకరణకు బడ్జెట్లో తగు నిధులు కేటాయించాలని, అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని, ఆహార భద్రత చట్టం అమలు చేయాలని, రేషన్ కార్డుదారులకు ఈకేవైసి ప్రక్రియ సులభతరం చేయాలని పై డిమాండ్ల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కుమార్ రామారావు, సింహాచలం, రాము, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

# 2025లో కిడ్నీ మహమ్మారిపై పరిశోధన పూర్తి : కలెక్టర్

## కిడ్నీ బాధిత ప్రాంతాలకు శుద్ధజలాలు అందించాలి : ఎమ్మెల్యే గౌతు శిరీష

**విశాలాంధ్ర - పలాస :** ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ మహమ్మారిపై పరిశోధనలు చేసేందుకు కొలంబియా నుంచి ఒకరు, యుఎస్ఎ నుంచి ఒక బృందం వచ్చిందని, పరిశోధనలు పూర్తి కావడానికి సుమారు ఏడాది కాలం పడుతుందని జిల్లా స్వప్నిల్ దినకర్ తెలిపారు. బుధవారం పలాస కిడ్నీ ఆసుపత్రిలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి వైద్యులు, అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి కిడ్నీ రోగాలపై ఇంత వరకు చేపట్టిన చర్యలపై పవర్ ప్రెజింటేషన్ ను ఆయన పరిశీలించారు. అనంతరం కొలంబోనియా లెక్స్యినేస్ నుంచి వచ్చిన శాస్త్రవేత్తతో ఆయన మాట్లాడి ఇక్కడ పరిస్థితిని వివరించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే ఉద్దానం ప్రాంతంలోని 80 మంది రక్త నమూనాలు సేకరించడం జరిగిందని వీటిపై వారు పరిశోధనలు చేస్తున్నారని తెలిపారు. చాలా కాలం నుంచి ఉద్దానం ప్రాంతంలోని ఏడు (ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట, కవిటి, మందస, వజ్రపు కొత్తూరు, పలాస) మండలాలలో కిడ్నీ రోగం అనేది క్రానికల్ డిసీజ్ గా మారిందని దానిపై కొలంబియా, యుఎస్ఎ శాస్త్ర వేత్తలు ఇక్కడకు వచ్చి అధ్యాయనం చేస్తున్నారన్నారని చెప్పారు. సౌత్ ఆఫ్రికా, కొలంబియా, కెనడా వంటి దేశాలలో కూడా కిడ్నీ వ్యాధి ఉందని ఆ ప్రాంతాలలో ఈ శాస్త్రవేత్తలు అధ్యాయనం చేయడం జరిగిందని, అదే శాస్త్రవేత్తలు నేడు ఉద్దానం ప్రజల రక్త నమూనాలు, నీరు, మట్టి వంటి వాటిని సేకరించి వాటిపై పరిశోదనలు చేసి కిడ్నీ వ్యాధి మూలాలలను శోధిస్తారని తెలిపారు. అంతే కాకుండా మున్సిపాలిటీలో తాగునీటి సమస్య ఉందని ఆరు ఎంఎల్ టి నీరు అవసరమని దీని కోసం ఆర్ డబ్ల్యు ఎస్ అధికారులతో మాట్లాడడం జరిగిందని, మిగిలిన ఈ ప్రాంత సమస్యలపై కూడా పూర్తి స్థాయిలో చర్చించడం జరిగిందన్నారు.

**ఏడు మండలాలలకు శుద్ధజలాలు అందించాలి**

**: ఎమ్మెల్యే గౌతు శిరీష**

పలాస నుంచి ఇచ్ఛాపురం వరకు ఉన్న ఏడు మండలాలలో ఉద్దాన ప్రాంతాలలో కిడ్నీ రోగులు అధికంగా ఉన్నారని వారిని కాపాడేందుకు, మూలాలు కనుగొనేందుకు శాస్త్రవేత్తలు అధ్యయనం చేస్తున్నారన్నారు. ముందుగా ఈ ఏడు మండలాలకు శుద్ధజలాలు అందించడం ద్వారా ప్రాధమిక దశలోనే కిడ్నీ రోగాలు అరికట్టే అవకాశం ఉందన్నారు. డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ కు కూడా కిడ్నీ రోగాలపై మంచి అవగాహన ఉందని ఉద్దానం ప్రజలపై అమితమైన ప్రేమ ఉందని ఆయన దృష్టిలో పెట్టడంతో పాటు జిల్లా మంత్రి, కలెక్టర్ చర్చించి ముందుగా శుద్ధజలాలు అందించేందుకు కృషి చేయాలని కోరామన్నారు. అదే విదంగా మున్సిపాలిటీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని అందువల్ల ఉద్దానం ప్రోజెక్ట్ ద్వారా ఆరు ఎంఎల్ఎల నీరు అందించాలని కోరామని వాటిని కలెక్టర్ పరిశీలించి చర్యలు తీసుకుంటారన్నారు. సమీక్షలో పలువురు వైద్యులు మాట్లాడుతూ ఇక్కడి వారు వెళ్లయిన తరువాత మరో ప్రాంతం వెళ్లినప్పటికీ వారికి కిడ్నీరోగాలు వస్తున్నాయంటే ఈ రోగాలు వంశ పారంపర్యంగా వస్తున్నట్లు కూడా తెలుస్తుందన్నారు.

**కలెక్టర్ దృష్టికి కిడ్నీ ఆసుపత్రి సమస్యలు**

జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ కిడ్నీ ఆసుపత్రి పర్యటనలో భాగంగా కిడ్నీ ఆసుపత్రి సూపరింటెండెంట్ అల్లు పద్మజ పలు ఆసువత్రి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఆసుపత్రిలో ఒక విభాగం వద్ద వాటర్ ఫిల్టర్ ఉందని, నాలుగు అంతస్తులు ఉండడంతో రోగులు తాగునీరు కిందకి రావలసి వస్తుందని, ప్రతీ ఫ్లోర్‌లో వాటర్ ఫిల్టర్లు ఏర్పాటు చేయాలని, అలాగే ఆసువత్రికి ప్రహరీగోడ లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కోంటున్నామని, వాటి నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలాస ఆర్డీవో భరత్ నాయక్, తహ శీల్దార్ బి.సత్యం, ఎంపీడీవో ఎన్ రమేష్ నాయుడు, వైద్యులు కూన మోహన బాబు, రామనరేష్, కూన కూర్మారావు, బాలాజీ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు లొడగల కామేశ్వరరావు గురిటి సూర్య నారాయణ గాలి కృష్ణారావు టంకాల రవిశంకర్ గుప్తా మల్లా శ్రీనివాసరావు కొరికాన శంకర్ బి.నాగరాజు దడియాల నర్సింహులు, కొండే నర్సింహులు, మున్సిపల్ అధికారులు, కిడ్నీ ఆసుపత్రి అధికారులు, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎరువులు బ్లాక్ చేస్తే డీలర్ల లైసెన్స్ రద్దు : కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**విశాలాంధ్ర - శ్రీకాకుళం :** ఈ సీజన్లో ఎరువుల పంపిణీ జిల్లా వ్యాప్తంగా పకడ్బందీగా జరుగుతోందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈ సీజన్ లక్ష్యం 61,262 టన్నులు కాగా లక్ష్యానికి మించి ఇప్పటి వరకూ 65,007 టన్నులు సరఫరా చేశామన్నారు. ఈ సెప్టెంబర్ నెలకు సంబంధించి ఎరువుల పంపిణీకి ప్రణాళిక సిద్ధం చేసినట్టు వివరించారు. గత నెల 28వ తేదీన జరిగిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో శాసనసభ్యులు, ఇతర సభ్యులు లేవనెత్తిన పలు అంశాలపై కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఆయన జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. గడిచిన సర్వసభ్య సమావేశంలో సభ్యులు అడిగిన అన్ని ప్రశ్నలకు పరిష్కారం చూపి, స్పష్టమైన లిఖిత పూర్వక సమాధానాలు ఇవ్వాలని ఆదేశించారు. భవిష్యత్తు అవసరాలకు జిల్లా కేంద్రాల నుంచి మండల కేంద్రాలకు, గ్రామాలకు అవసరమైన ఎరువులను ముందస్తుగా నిల్వ చేయాలని, జిల్లా, డివిజన్, మండల అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని, ఎక్కడైనా నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తీసుకోవాలని, డీలర్లు బ్లాక్ చేస్తే లైసెన్సు రద్దు చేయాలని ఆదేశించారు. సిఆర్జెడ్ నిబంధనలకు లోబడే తీరప్రాంత గ్రామాలలో భూముల రిజిస్ట్రేషన్లు జరగాలని ఆదేశించారు. బిఆర్ఆర్ వంశధార ప్రాజెక్టు, నీటిపారుదల శాఖలలో ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్న సమస్యలకు పరిష్కార మార్గాలను సూచించాలని ఈ విషయంలో ఉదాసీనంగా ఉంటే ఆయా అధికారులపై చర్యలు తప్పవని, పనులు పూర్తి చేయడానికి ముందుకు రాని కాంట్రాక్టర్లను తొలగించాలని హెచ్చరించారు. ఉపాధి హామీ జాబ్ కార్డుల మంజూరులో సరళంగా వ్యవహరించాలని సూచించారు. ఆశా వర్కర్లు జాబ్ చార్ట్ ఆధారంగా పనిచేసేలా పర్యవేక్షించే బాధ్యత డిఎంహెచ్ఓ దేనని కలెక్టర్ స్పష్టం చేశారు. పలు నిబంధనలు కారణంగా కరువు మండలాలుగా ప్రకటించే అవకాశం లేని మండలాలకు పంటల బీమాను వర్తింపచేయాలని ప్రభుత్వానికి నివేదించామని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, జడ్పీ సీఈవో వెంకటేశ్వరరావు, డిసిఓ నగేష్, డిఎంహెచ్ఓ డాక్టర్ మీనాక్షి, జిల్లా రిజిస్ట్రార్ కిల్లి మన్మధరావు, వ్యయసాయ శాఖ జేడి కే.శ్రీధర్, నీటిపారుదల శాఖ ఎస్ఈ పొన్నాడ సుధాకర్ రావు, ద్వామా పీడీ ఎన్.వి.చిట్టి రాజు, డిఈఓ తిరుమల చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధికి పదివేల ఆర్థిక సహాయం

**విశాలాంధ్ర - శ్రీకాకుళం :** విజయవాడ వరద ముంపు బాధితులకు తనవంతుగా రూ.పది వేల ఆర్థిక సహాయాన్ని విశ్రాంత తహసిల్దార్ సిహెచ్ సుభాషిని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌రకు అందజేశారు. రిటైర్డ్ రెవిన్యూ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, విశ్రాంత అదనపు జాయింట్ కలెక్టర్ పి రజనీకాంతరావుతో కలిసి బుధవారం ఆమె ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేశారు. సర్వం కోల్పోయి వీధిన పడిన వారిని ఆదుకునేందుకు తన వంతుగా సీఎం సహాయ నిధికి ఈ మొత్తాన్ని విరాళంగా ఇస్తున్నట్లు ఆమె చెప్పారు.

## రైల్వే అండర్ పాస్ వంతెన ప్రజలకు ఇబ్బంది

**విశాలాంధ్ర - జలుమూరు :** శ్రీకాకుళం జిల్లాలో వాల్టేర్ డివిజన్లో ఉన్నటువంటి రైల్వే నిర్మించిన అండర్ పాస్ వంతెన నిర్మాణాలు ఇటు రైతులకు అటు ప్రజలకు ఇబ్బంది కలిగిస్తుందని నరసన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మాజీ డివిజనల్ రైల్వే బోర్డు మెంబర్ మంత్రి నరసింహమూర్తి బుధవారం జిల్లా కలెక్టర్ స్వప్నల్ దీన్ కోర్టుకు ఫిర్యాదు చేశారు. ప్రజల రాకపోకలకు చాలా అంతరాయం గా ఉందని ఉర్లం రైల్వే స్టేషన్ చిక్కాల వలస జలుమూరు మండలంలో ఉన్నటువంటి కొన్ని వంతెనలు రైతు రాకపోకలకు వ్యవసాయ పనులు చేసుకొనుటకు చాలా ఇబ్బందికరంగా ఉందని ఆ ఫిర్యాదుల పేర్కొన్నారు. ఈ విషయంపై తక్షణమే పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ దృష్టికి వాల్తేర్ డివిజన్ రైల్వే మేనేజర్ దృష్టికి తీసుకు వెళ్తున్నట్లు మంత్రి నరసింహమూర్తి తెలిపారు.

## తుఫాను రక్షిత భవనాన్ని పునర్నిర్మించండి

**మంత్రి అచ్చంనాయుడుకు వినతి**

**విశాలాంధ్ర - సంతబొమ్మాలి :** ఈ మండలం మేఘవరం పంచా యతీలో గల సూరాడవాని పేట తుఫాను రక్షిత భవనాన్ని పునర్నిర్మించాలని, మత్స్య కార సంఘం నాయకులు సూరాడ ధనరాజు, బైపిల్లి కుమారస్వామి, సూరాడ చిన్న దాన రాజులు రాష్ట్రవ్య వసాయశాఖ మంత్రి, శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నా యుడుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేసారు. తుఫాను రక్షితభవనము బాగా శిధిలావస్థకు చేరినందున, తుఫాను సమయంలో అత్యవసర సమయాల్లో, మత్స్య కారులు నివ సించేం దుకుమ ఇబ్బంది కలుగుతుందని మంత్రి దృష్టికి తీసుకు వెళ్లారు. అలాగే అదనంగా పాఠశాల భవనాన్ని నిర్మించాలని, నిర్మిం చేందుకు నిధులు మంజూరు చేయాలని వారు కోరారు. వారితో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## ఉపాధ్యాయ దినోత్సవాన్ని స్వాగతించిన జేబిటి

**విశాలాంధ్ర - జలుమూరు :** ఉపాధ్యాయ దినోత్సవం స్వాగతిస్తూ బుధవారం సారవకోట మండలం అవలంగి జేబీటి పాఠశాల విద్యార్థులు వివిధ రకాల పుష్పాలతో ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పుష్పాలతో చిత్రించిన ఈ దినోత్సవం పలువురు తిలకించి ఆనందింపబడ్డారు.

## విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

**విశాలాంధ్ర - నరసన్నపేట :** విద్యార్థులు చదువులో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు లక్ష్యాలను నిర్దేశించుకోవాలని మండల విద్యా శాఖాధికారి, పి.దాలినాయుడు అన్నారు. బుధవారం పట్టణంలో ఒక కళ్యాణ మండపంలో జ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఎం.ఈ.వో, దాలినాయుడు మాట్లాడుతూ విద్యార్థుల ఆశయ సాధనకు తల్లితండ్రులే పూర్తి సహకారం అందించాలని తెలిపారు. అనంతరం రిటైర్డ్ ఆర్.ఐ.ఓ, ఎస్.రుక్మాంగధరావు మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా విద్యార్థులు చదువుకుంటేనే వారు కోరుకున్న స్థాయికి చేరుతారన్నారు. అలాగే మొట్టమొదటిసారిగా సాంకేతిక పరమైన విద్యా విధానంతో పాటు పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ జ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాలలో ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్, కృష్ణారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జ్ఞానజ్యోతి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రవీణ, ఏవోలు, అప్పారావు, సత్యన్నారాయణ, జ్ఞానజ్యోతి స్కూల్ ప్రిన్సిపాల్, అసిరినాయుడు తదితరులున్నారు.

## క్రీడలకు ఆదరణ పెరగాలి

**జిల్లా బ్యాడ్మింటన్ ను పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యేలు శంకర్, ఈశ్వరరావులు**

**విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ :** విద్యార్థులను చిన్నతనం నుంచే క్రీడలపై ఆసక్తి పెరిగేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని, క్రీడలకు ఆదరణ పెరగాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వరరావు ఆకాంక్షించారు. శ్రీకాకుళం జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ ఆసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న డీఎస్ఏ ఇండోర్ స్టేడియం వేదికగా మూడు రోజులపాటు నిర్వహించనున్న ఏపీ రాష్ట్రస్థాయి (అంతర్ జిల్లాల) జూని యర్స్ (అండర్-19) బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్షిప్ పోటీలను శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వరరావులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమని, క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన క్రీడాకారులు కరణం మల్లేశ్వరి, నీలం శెట్టి లక్ష్మీ, కాసింఖాన్ వంటి వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జిల్లాకు పేరు తెచ్చారని చెప్పారు. బ్యాడ్మింటన్ లో తెలుగు రాష్ట్రాలకు చెందిన పీవీ సింధు, పుల్లెల గోపీచంద్ జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారని స్పష్టం చేశారు. సాధించాలన్న తపన, పట్టుదలతో ప్రయత్నిస్తే విజయాలు సొంతమవుతాయని చెప్పారు. త్వరలోనే కోడిరామ్మూర్తి స్టేడియాన్ని అందుబాటులోకి తెచ్చి అన్ని క్రీడాంశాల్లో జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించుకునేలా ప్రతి ఒక్కరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఇంత పాటు టిడిపి, జనసేన, బిజెపి నాయకులు క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## నిస్వార్థ సేవకు చిరునామా 'వరం' కుటుంబం

**రిమ్స్ అన్నపూర్ణ సేవకు రూ.25 వేలు విరాళం అందజేత**

**విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ :** దివంగత మాజీ మున్సిపల్ చైర్మన్ అంధవరపు వరహానర్సింహం కుటుంబ సభ్యులు నిస్వార్థ సేవకు చిరునామా నిలుస్తున్నారని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. వరం జయంతిని పురస్కరించుకొని నగరంలోని రిమ్స్ ఆసుపత్రి ఆవరణలో నిర్వహిస్తున్న రిమ్స్ అన్నపూర్ణ సేవకు వరం కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే గొండు శంకర్ ద్వారా రూ.25 వేలు చెక్కును బుధవారం అందజేశారు. సంస్థ అధ్యక్షులు సూర రామచంద్రరావు, గంగుల రమణ, సెక్రెటరీ కిల్లాన ఫల్గుణ రావు, రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణరావులు ఈ సందర్భంగా మాట్లాడుతూ వరం పేరిట ప్రతీ ఏడాది విరాళం అందిస్తున్నందుకు వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. రోగుల సహాయకులకు మధ్యాహ్నం, రాత్రి రెండు పూటలా నిస్వార్థంగా గత 12 ఏళ్లుగా ఆహారం అందజేస్తు న్నామని తెలిపారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ రోగులకు, గర్భిణులకు, బాలింతలకు వేడినీటిని అందించడం, వారికి తోడుగా వచ్చే సహాయకులకు ఆహారం అందించడం గొప్ప విషయమని కొనియాడారు. అన్నదానం మహాదానంతో సమానమని చెప్పారు. మనిషి కడుపారా అన్నం తిని సంతృప్తి చెందుతాడని దానికి మించిన సేవ మరొకటి లేదని పేర్కొన్నారు. రిమ్స్ అన్నపూర్ణ సేవకు తన సహకారం ఎల్లవేళలా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వరం కుటుంబ సభ్యులు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, కుమారులు అంధవరపు ప్రసాద్, అంధవరపు సంతోష్‌తో పాటు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండండి : డాక్టర్ సుజాత

**విశాలాంధ్ర - జలుమూరు :** ప్రస్తుత తరుణంలో గ్రామాల్లో ప్రబలుతున్న సీజనల్ వ్యాధులపై ప్రజల అప్రమత్తంగా ఉండాలని జలుమూరు మండలం అచ్చుతాపురం ప్రాథమిక వైద్యాధికారిని పి.సుజాత అన్నారు. నందవరం పంచాయతీ రామకృష్ణాపురం గ్రామంలో బుధవారం ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు భోజనానికి ముందు చేతులు కాళ్లు శుభ్రం చేసుకోవాలని కాచిన వేడి నీళ్లు చల్లార్చి తాగాలని ఆమె సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రభావంపై అవగాహన కల్పించారు. డెంగ్యూ మలేరియా చికెన్ గున్యా వంటి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆమెతో పాటు పర్యవేక్షణ అధికారి మోహన్‌రావు, హెల్త్ అసిస్టెంట్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పలువురు పాల్గొన్నారు.

## బాధితులకు బాసటగా మున్సిపల్ కార్మికులు

**బస్సును జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే గొండు శంకర్**

**విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ :** విజయవాడలో వరదల కారణంగా ఇబ్బందులు పడుతున్న బాధిత ప్రజలకు సహాయ సహకారాలు అందించేందుకు శ్రీకాకుళం మున్సిపల్ కార్మికులు విజయవాడకు బయలు దేరారు. ఈ బస్సును శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదల కారణంగా విజయవాడ ప్రాంతంలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి సహాయ సహకారాలు అందించేందుకు మానవతాదృక్పథంలో జిల్లాకు చెందిన మున్సిపల్ కార్మికులను విజయవాడ తరలించినట్టు వివరించారు. జిల్లా నుంచి పలు స్వచ్ఛంద సంస్థలు స్పందించి పెద్ద ఎత్తున ఆహార పదార్థాలు, దుస్తులు అందజేయడం గొప్ప విషయమన్నారు. విపత్తుల సమయంలో బాధితులను ఆదుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని నిస్సాహాయ స్థితిలో ఉండిపోయిన వారికి చేయూత నందించేందుకు ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విరాళాలు అందజేసి బాధితులకు బాసటగా నిలవాలని ఎమ్మెల్యే శంకర్ కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మెండ దాసునాయుడు, మదారపు వెంకటేష్, నగర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధి పలు గ్రామాల్లో అవేర్నెస్ ప్రోగ్రాం

**విశాలాంధ్ర - జలుమూరు :** గత నాలుగు రోజులకు కురిసిన వర్షాలకు గ్రామంలో ఎటువంటి అంటూ వ్యాధులు ప్రబల కుండా జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి పెద్దదూగం జోనంకి గ్రామాల్లో బుధ వారం అవేర్నెస్ ప్రోగ్రాంని ఏర్పాటు చేశారు. ప్రజలు కాచిన వేడి నీళ్లు చల్లార్చి తాగాలని, వేడి పదార్థాలు భుజించాలని, తాగునీటి బావుల్లో క్లోరినేషన్ చేయించారు. జోనంకి గ్రామంలో కాలువలు పూడికతీతలును చేయించారు. అక్కడ బావుల్లో క్లోరినేషన్ చేయించారు. వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆరోగ్య కార్యకర్తలు వై సత్యవతి, ధనలక్ష్మి, చిన్నారావు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## రెండు తెలుగు రాష్ట్రాలకు బైపల్లి పరమేశ్వరరావు భారీ విరాళం

**విశాలాంధ్ర - టెక్కలి :** రెండు తెలుగు రాష్ట్రాలు వరదలకు అతలా కుతలం అవుతున్న తరుణంలో జై భారత్ నేషనల్ పార్టీ ఇన్చార్జి బైపల్లి పరమేశ్వరరావు ఓ సామాన్యుడిగా తను వంతు సహాయంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నిధికి లక్ష రూపాయలు, తెలంగాణ ముఖ్యమంత్రి నిధికి 50 వేలు రూపాయల భారీ విరాళం బుధవారం అందజేశారు. అతి త్వరగా ఈ విపత్తు నుండి ప్రజలు కోలుకుని దేవుడి ఆశీస్సులతో చల్లగా ఉండాలన్నారు. కాగా ఇటివలే కేరళ వయనాడ్ బాధిలకు లక్ష రూపాయలు, హుదూద్, తిల్లీ తుఫాన్ మరెన్నో విపత్తులకు ఆయా కష్ట సమయాల్లో ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి సహాయ నిధులకు భారీ విరాళాలు ఇవ్వడం గమనార్హం. ప్లానింగ్ మేనేజర్ గా ఉద్యోగం చేస్తూ తనకి ఇష్టమైన యుపిఎస్సి పరీక్షకి చదువుతున్న పరమేశ్వరరావు తనకి వీలున్నంత వరకు సమాజంలో సాటి మనిషి బాగు కోసం తన వంతు ఓ సామాన్యుడిగా ముందు ఉంటానని పేర్కొన్నారు.

## పారిశుధ్య పనులను పరిశీలించి డీఎల్‌పీఓ

**విశాలాంధ్ర - హిరమండలం :** హిరమండలం మేజర్ పంచాయతీలోని పాత హిరమండలం ప్రాథమిక పాఠశాల రహదారి గుండా ఏర్పడిన పారిశుధ్యమును జె సిబి సహాయంతో బుధవారం టెక్కలి డివిజనల్ పంచాయతీ అధికారి ఇప్పిలి వెంకటరావు పర్యవేక్షణలో పారిశుధ్య పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద డివిజనల్ పంచాయతీ అధికారి ఐ వెంకట్‌రావు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు మేజర్ పంచాయతీలో ఎక్కడెక్కడ పేరుకు పోయిన చెత్త చెదారంను పూర్తి గా తొలగించడం జరుగుతుందని పారిశుధ్యం ను పూర్తిగా నిర్మూలన చేస్తు న్నామని ప్రతీ రోజు పంచాయతీకీ చెందిన పారిశుధ్య కార్మికులు ఈఓ వైఎస్ఆర్ మూర్తి పర్యవేక్షణలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారని తెలిపారు. మేజర్ పంచాయతీలో త్రాగునీటికి గాని, పరిసరాల పరిశుభ్రతకు గానీ ప్రజలకు ఎఇబ్బంది కలగకుండా చర్యలు తీసు కోవడం జరుగుతుందని అన్నారు. ఈఓ వై ఎస్ ఆర్ మూర్తి, పంచాయతీకీ చెందిన జూనియర్ సహాయకులు ఎ.నర్సింగ్‌రావు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు ఎవి.సురేష్, ఉప సర్పంచ్ వి.బాలరాజువార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మందసలో పారిశుధ్యంపై దృష్టి సారించండి

**జనసేన నాయకులు దిలీప్ కుమార్ పాణిగ్రాహి**

**విశాలాంధ్ర - మందస :** మందసలో పారిశుధ్యం మరియు బయోమెడికల్ వ్యర్థాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి దిలీప్ కుమార్ పాణిగ్రహి అన్నారు. ఈ మేరకు బుధవారం పలాస కిడ్నీ ఆసుపత్రిలో సమీక్ష సమావేశానికి హాజరైన జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందస గ్రామంలోని పారిశుధ్యం మరియు పరిశుభ్రత పరిస్థితులకు సంబంధించి అత్యంత ఆందోళన కలిగించే విషయాన్ని కలెక్టర్ గారి దృష్టికి తీసుకువెళ్లారు. సీజనల్ వ్యాధులు మరియు వైరల్ జ్వరాలకు దారితీసే అపరిశుభ్రమైన పరిసరాల వల్ల నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పెద్ద ఆందోళన కలిగిస్తుంది అన్నారు. గ్రామంలో బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణకు సరైన వ్యవస్థ లేదని, షెడ్యూల్ 4 ప్రకారం పొల్యూషన్ బోర్డు మార్గదర్శకాలను అందరు వైద్య నిపుణులు పాటించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బయో మెడికల్ వ్యర్థాలను నేలలో విసిరేయడం వల్ల నీటి కాలుష్యం మరియు వాయు కాలుష్యం ఏర్పడవచ్చుని తక్షణమే పరిష్కరించక పోతే ఆరోగ్యం ప్రమాదంగా మారే అవకాశం ఉందన్నారు. బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ కొరకు ఒక ప్రత్యేకమైన వ్యవస్థను తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో దువ్వాడ వంశీ చౌదరి, దున్న హరికృష్ణ పాల్గొన్నారు.

# భారీ భవంతులతో భయం... భయం

## అక్రమంగా అడ్డుగోలు నిర్మాణాలు..

**విశాలాంధ్ర - పలాస :** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ కట్టడాలు యథేచ్ఛగా జరుగుతున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్లను, కాలువలను కబ్జా చేసి ఇంటి నిర్మాణాలు చేపడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. మరి కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా బహుళ అంతస్థులు నిర్మాణాలు చేపడుతూ ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడంటం లేదు. అటువంటి అక్రమంగా... అడ్డుగోలుగా భారీ భవనం తిలక్ నగర్, గాంధీనగర్‌లో నిర్మాణాలు చేపడుతున్నప్పటికి సంభందించిన అధికారులు మాత్రం నిద్రమత్తు వదలడం లేదు. వివరాల్లోకి వెళ్తే... స్థానిక ఎల్ఐసి కార్యాలయం వెనుక భాగం లో ఉన్న తిలక్ నగర్ లో రెండు, మూడు స్లాబ్ లకు అనుమతులు తీసుకొని, ప్రమాదకర స్థాయిలో ఐదు అంతస్తులు భవంతి నిర్మాణం చేపడుతుండడంతో స్థానికుల్లో భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి. చిన్నపాటి రహదారి కలిగి ఉన్న వీధిలో భారీ భవనం ఏ ప్రమాదం తెచ్చి పెడుతుందోనని అక్కడ నివసిస్తున్న వారిలో ఒకటే టెన్షన్. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆ భవనంలో కదలికలు వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే నిర్మాణదారుడు సాఫీగా ఉంటాడని, చుట్టుపక్కల ఉన్న ఇల్లు నేలమట్టమై జరిగే ప్రాణనష్టం ఊహించు కుంటుంటునే భయమేస్తుందని అక్కడ ప్రజలు వాపోతున్నారు. ఆ భవనం నిర్మాణానికి అతని స్థలం సరిపోక పోవడంతో మున్సిపాలిటీ కాలువ సైతం ఆక్రమణ చేశారని విమర్శలు ఉన్నాయి

**చర్యలు తీసుకోవాలి :** భారీ భవనం నిర్మాణం పై మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రమాదకరంగా అక్రమంగా నిర్మించిన అదనపు స్లాబులను తొలగించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. అక్రమ నిర్మాణాలపై అందిన కాడికి దోచుకొని చర్యలు తీసుకోకపోతే, రేపు జరగబోయే ఏ ప్రమాదానికైనా అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

## నేడు ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన సత్కారాలు

విశాలాంధ్ర - జలుమూరు : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సారవకోట మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని దివంగత చిన్నాల రంగారావు, నాయుడు మాస్టర్ జ్ఞాపకార్థం కుమారులు మండల అధ్యక్షులు చిన్నాల కూర్మినాయుడు, సౌజన్యంతో మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం జరుగుతుందని మండల విద్యాశాఖ అధికారి మద్దు వెంకట రమణ తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు బగ్గు రమణ మూర్తి పాల్గొంటారని మండలంలో ఉపాధ్యాయ సోదరీ సోదరీమణులు కార్యక్రమంలో పాల్గొనాలని ఎంఈఓ రమణ కోరారు.


విశాలాంధ్ర శ్రీకాకుళం
పేజీ : 2
గురువారం 5, సెప్టెంబరు 2024


# సచివాలయ సిబ్బంది తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

### - సమయపాలన పాటించని ఉద్యోగులు

### - ఆకస్మిక తనిఖీలతో బయటపడ్డ డొల్లతనం

విశాలాంధ్ర - ఆమదాలవలస : సమయపాలన పాటించని సచివాలయ ఉ ద్యోగుల తీరుపై ఎమ్మెల్యే కూన రవి కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సైలాడ సచివాల యాన్ని బుధవారం ఆకస్మిక తనిఖీలు ఉద్యోగుల డొల్లతనం బయటపడింది. ఆమదాల వలస నియోజకవర్గంలో పరా మర్శలకు వెళుతున్న క్రమంలో సైలాడ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన శాసనసభ్యులు కూన రవికుమార్ ఉద్యోగుల హాజరు పట్టిక పరిశీలించగా వారి పనితీరు, కార్యాలయ నిర్వహణలో నిర్లక్ష్యం, రికార్డులు నిర్వ హణ అధ్వాన్న స్థితి వెలుగులోకి వచ్చాయి. 10 గంటల సమయం అయినప్పటికీ సచివా లయానికి ఉద్యోగులు చేరుకో కపోవడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత ఈవోపీ ఆర్డీకి ఫోన్ చేసి పరిస్థితులను ఆరా తీశారు. వెంటనే అక్కడకు చేరుకున్న గోవిందరావు సిబ్బంది తీరుపై నివేదిక అందిస్తానని తెలిపారు. రిజిస్టర్ తనిఖీ చేస్తూ సిబ్బందికి ఎమ్మెల్యే రవికుమార్ ఫోన్ చేసి వారి విధుల నిర్వహణ తీరును, ప్రజలకు అందించ వల సిన సేవలు పై నిర్లక్ష్యాన్ని తప్పుపట్టారు. మురికి కాలువలో తొలగించిన చెత్తను అక్క డే పోగులుగా వేసి ఉంచడంపై శానిటేషన్ కార్యదర్శికి ఫోన్లో వివరణ అడిగారు. తక్షణ మే అన్ని సచివాలయాల కార్యదర్శులకు సిల్ట్ తొలగింపులో నిర్లక్ష్యంపై నోటీసులు ఇవ్వాలని సంబంధిత ఉన్నతాధికారులకు ఆదేశాలందిచారు. అందుబాటు ఉన్న వారిని మిగిలిన వారు ఎక్కడని ప్రశ్నించగా వాళ్ల నుండి సరైన సమాధానం దొరకలేదు. దీనితో హాజరు రిజిస్టర్ ని పరిశీలించగా సక్రమంగా విధులు నిర్వ హించకుండా గైర్హాజరవుతూ ఉద్యోగుల హాజ రు రిజిస్టర్లో దొంగ సంతకాలు పెడుతున్నట్లు గుర్తించారు. సచివాలయ ఉద్యోగులు ఇష్టా రీతి వ్యవహరిస్తూ నచ్చిన విధంగా ఉన్నత అధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వ కుండా సెలవులు పెట్టేస్తూ సమయపాలన పాటించకుండా విధులు నిర్వహిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసారు. విధులు సక్రమంగా నిర్వహించని కొందరు సచివాలయ ఉద్యోగులపై కలెక్టర్ కి మరియు సంబంధిత అధికా రులకు విచారణ చేసి చర్యలు తీసుకునేందుకు నివేదికను అందించారు. ప్రజలకి సరైన సేవలు అందకపోతే ఉద్యోగులపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఈ సందర్భంగా హెచ్చరించారు.

## మట్టి గణపతిని పూజించండి

విశాలాంధ్ర - సోంపేట : పర్యావరణ పరిరక్షణకు కాలుష్య రహిత సమాజ నిర్మాణానికి రాబోవు వినాయక చవితి పర్వదినాల్లో ప్రతి ఒక్కరూ మట్టి గణపతిని పూజించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని సోంపేటకు చెందిన ఎస్ఎస్ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ దుద్ది శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. వందలాది మందికి సోంపేటలో బుధవారం మట్టి గణపతి విగ్రహాలను తాను ఉచితంగా పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సోంపేటకు చెందిన ప్రముఖ వైద్యుడు, గైనకాలజిస్ట్ డాక్టర్ ఎ.వి.రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై ఆయన చేతుల మీదుగా విగ్రహ పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ పర్యా వరణాన్ని పరిరక్షించడంలో ఇటువంటి కార్యక్రమం ఎంతగానో దోహద పడుతుందని అన్నారు. అటువంటి మంచి ఆలోచనతో సమాజానికి అనేక విధాలుగా సేవలం దిస్తున్న డాక్టర్ దుద్ది శ్రీనివాసరావును డాక్టర్ రామకృష్ణ అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఈ.లక్ష్మినారాయణ, చిత్రాడ శేఖర్, వజ్జ కృష్ణ, గున్న ధనుంజయ, వెదుళ్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలపై నిఘా : సీఐ అంబటి విజయ్ కుమార్

విశాలాంధ్ర - టెక్కలి : అసాంఘిక కార్యకలాపాల పై ప్రత్యేక నిఘా పెడతానని టౌన్ సీఐ అంబటి విజయ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం పోలీస్ కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఈ మధ్య దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని వాటిపై ప్రత్యేక దృష్టి పెడతానని అన్నారు. అలాగే బహిరంగంగా మద్యం తాగడం, అనుమతి లేని బెల్టు షాపులు, కళాశాలలో, బస్టాండ్ లో ఈవిటీజింగ్, వివిధ జంక్షన్ల వద్ద ట్రాఫిక్, మాదకద్రవ్యాలు వంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెడతానని అన్నారు. చట్టాలను చేతిలోకి తీసుకుని ఇష్టారాజ్యంగా చెలరేగిన రౌడీయిజం పై ఉక్కు పాదం మోపుతానని స్పష్టం చేశారు. మైనర్ చిన్నపిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వకూడదని, మైనర్లు వాహనాలతో రోడ్లపైకి వస్తే ఆ వాహనాలను సీజ్ చేస్తామని అన్నారు. అలాగే, రాబోయే వినాయక చవితి ఉత్సవాలకు విగ్రహాల ఏర్పాటుకు పోలీస్ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని అన్నారు. వినాయక ఉత్సవ కమిటీ వారు ముందుగానే పోలీస్ అనుమతి తీసుకోవాలని, లౌడ్ స్పీకర్లు వినియోగించకూడదని, గణేష్ ఉత్సవ సింగిల్ విండో సిస్టం ఆన్లైన్ రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. మండపాలు వద్ద అగ్ని ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి రోజు మండపం వద్ద తప్పనిసరిగా రాత్రి సమయంలో కమిటీ మెంబర్లు ఉండాలని సూచించారు. హుండీ రాత్రిపూట మండపాలలో ఉండకూడదని తెలిపారు. ఊరేగింపు సమయాలలో ట్రాఫిక్ కి అంతరాయం కలగకూడదని, బాణసంచాలు కాల్చకూడదని, రాత్రి 11:00 కల్లా వినాయక విగ్రహ నిమజ్జనం పూర్తి చేసుకోవాలని అన్నారు. విగ్రహం వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆయనతోపాటు పోలీసు సిబ్బంది ఉన్నారు.

## గోతులమయమైన 'నారాయణవలస'

### పరిశీలించిన వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ ప్రతినిధి, బావాజీనాయుడు

విశాలాంధ్ర - నరసన్నపేట : మండలం కరగాం పంచాయితీ నారాయణ వలస గ్రామంలో ఇటీవల నిర్మాణం చేసిన ఇంటి ఇంటి కొళాయిల కారణంగా గ్రామం లోని రహదారులు, మురికినీటి కాలువలు గోతుల మయంగా మారటంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయమై గ్రామస్థులు ఫిర్యాదు మేరకు పంచాయితీ సర్పంచ్, వెలమ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ ప్రతినిధి, పంగ బావాజీ నాయుడు బుధవారం గ్రామానికి వెళ్ళి, రహదారులను, మురికికాలువలను పరిశీలించారు. ఈ సంధర్భంగా ఆయన గ్రామస్థులతో మాట్లాడుతూ రోడ్లపై వున్న గుంతలు పూడ్చడానికి, స్కూల్ భవనం వద్ద నడక దారిని ఏర్పాటు చేయుటకు, మురికి కాలువల్లో పూడిక తీసేందుకు సుమారు 20లోడ్ల గ్రావెల్, 20లోడ్ల స్టోన్ క్రషర్ డస్ట్ అవసరమని తెలిపారు. వారం రోజుల్లో ఈ పనులన్నీ పూర్తి అయ్యే విధంగా తగిన చర్యలు తీసుకుంటామని బావాజీ నాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు మెంబర్లు, వెలమల రమణయ్య, వాన శ్రీరాములు, పంచాయితీ కార్యదర్శి, దుబ్బాక అప్పలరాజు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్, సింహాద్రి హరికృష్ణ, గ్రామ పెద్దలు, మెండ సత్యం, అంబటి శిమ్మయ్య, వెలమల కేశవరావు, చిన్నాల దాలయ్య, భైరి రామారావు, ముద్దాడ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా జీవన్ ఎంపిక

విశాలాంధ్ర - పొందూరు : పొందూరు ఏపీ మోడల్ స్కూల్ బోటనీ ఉపాధ్యాయుడు (పిజిటి) గుంటుముక్కల జీవన్ ను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా అధికారులు ఎంపిక చేశారు. ఈయన బోటనీ సబ్జెక్టులో శత శాతం ఫలితాలను సాధించడంతో ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డు కు ఎంపికయ్యారు. ఈయన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం పట్ల ప్రిన్సిపాల్ హెచ్. ప్రభాకర్, ఉపాధ్యా యులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.

## పాఠశాలకు వాటర్ ప్యూరిఫైర్ అందజేత

విశాలాంధ్ర - సోంపేట/కంచిలి : కంచిలి మండలం చొట్రాయిపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ఎస్ఎంసి చైర్మన్ కర్రి సుందరరావు బుధవారం 7500 రూపాయల విలువైన వాటర్ ప్యూరిఫైర్‌ను అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. గత ఐదేళ్లుగా సుందరరావు చైర్మన్‌గా ఉంటూ పాఠశాల అభివృద్ధికి ఇతోధికంగా సేవలందిస్తున్నారని ప్రధానోపాధ్యాయుడు మద్దు తిరుపతిరావు పేర్కొన్నారు. గతంలో అనేక సేవా కార్యక్రమాల ద్వారా విద్యాభివృద్ధిలో భాగస్వాములవుతున్న సుందరరావును ప్రధానోపాధ్యాయుడుతో పాటు ఇతర ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు అభినందించారు.

## జై హింద్ ఫౌండేషన్ సభ్యుల దాతృత్వం

విశాలాంధ్ర - కవిటి : బతుకు తెరువు కోసం వలస వెళ్లిన నిరుపేద రోగికి సాయం అందించిన జై హింద్ ఫౌండేషన్ సభ్యులు దాతృత్వం చాటుకున్నారు. ఈ మేరకు బుధవారం మండలం లో గల ప్రగడపుట్టుగ గ్రామానికి చెందిన బతకల అప్పారావు లేబర్ అనే వ్యాధితో బాధపడుతూ జిల్లా కేంద్రంలోని మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాపాయ స్థితిలో వున్నదని తెలుసుకొని జై హింద్ ఫౌండేషన్ సభ్యులు 20 వేల రూపాయలు ఆర్థిక సహాయం అప్పారావు కుటుంబ సభ్యులకు అందజేశారు. దాతలు స్పందించి ఆర్థికంగా అప్పారావుకు ఆదు కోవాలని జైహింద్ ఫౌండేషన్ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో పాండవ చంద్రశేఖర్, తలగాన కామేష్, మద్దిలి విలాస్, కర్రి అశోక్, బతకల శివ, వంజరాన జయరామ్, బతకల అఖిల్, ముత్యాల కూర్మారావు, గ్రామ యువత పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ దినోత్సవానికి గురు ఆకృతితో స్వాగతం

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సంత బొమ్మాళి మండలము బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, గురు ఆకృతిలో స్వాగతం పలికారు. గురు ఆకృతిని ఉపాధ్యాయులు, సహవిద్యార్థులు తిలకించారు.

## మరువాడ ప్రయాణికులకు మరోఆర్టీసీబస్సు సర్వీస్

### తీరప్రాంత ప్రజలకోర్కె తీర్చిన మంత్రి అచ్చెన్న

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : ఈమండలము మరువాడ ప్రయాణీకులకు మరో ఆర్టీసి బస్సు సర్వీస్ నుంచిప్రారంభం అయింది. స్థానిక తెలుగుదేశం పార్టీ నాయ కులు, రాష్ట్ర వ్యవసాయ, పాడి పరిశ్రమ, మార్కెటింగ్, మత్యశాఖ మంత్రి కింజరాపు అచ్చె న్నాయుడుకు, చేసిన విజ్ఞప్తి మేరకు, మధ్యాహ్నం 2 గంటలకు అదనంగా, మరోట్రిప్ ఆరీసీ బస్సు వేసి నట్లు మాజీ మండల ఉపాధ్యక్షులు సూరాడ భీమారావు తెలిపారు. ప్రస్తుతం ఉదయం 7 గంటలు, 11 గంటలకు ఇప్పటికే నడుస్తున్నాయని ఆయన తెలిపారు. బుధవారం మధ్యానం నుంచి 2 గంటలకు బస్ సౌకర్యం గతంలో వుండగా, గత ప్రభుత్వంలో రద్దు అయిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో అదే సౌకర్యాన్ని పునరుద్ధరించారని ఆయన తెలిపారు. ఈ సౌకర్యాన్ని కల్పించిన మంత్రి, టెక్కలి డీఎంలకు తీరప్రాంత తెలుగుదేశం పార్టీనాయకులు హర్షం వ్యక్తం చేసారు.

## డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ

విశాలాంధ్ర - రణస్థలం : మండలం, తెప్పలవలస గ్రామం లో అంబేద్కర్ యువసేన పిలుపు మేరకు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ మహోత్సవం లో ఎచ్చెర్ల శాసనసభ్యులు నడుకుదిటి ఈశ్వర రావు పాల్గొన్నారు. విగ్రహం ప్రతిష్ట టైమ్ లో దురదృష్ట వశాత్తుగా యాగాటి రామప్పడు చనిపోయాడని గ్రామస్తులు తెలియజేడంతో చనిపోయిన రామప్పడు కుమారుడు ఘగన్ కు ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ లో ఫ్రీగా చదివిస్తానని ఎమ్మెల్యే ఈశ్వరరావు తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అందరు ఎమ్మెల్యే కి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో కూటమి నాయకులు ప్రభాకర్, కనకరావు, జగన్నాథ నాయుడు, భానోజీ నాయుడు, జై భీమ్ సభ్యులు, అప్పలసూరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ మార్పు వల్లే రవాణా ఛార్జీల చెల్లింపులో జాప్యం

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : ఏపీ బేవరేజెస్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎచ్చెర్లలోని బాట్లింగ్ డిపో నుంచి మద్యం సరఫరా చేసే ట్రక్కు డ్రైవర్లకు రవాణా ఛార్జీల చెల్లింపులో జాప్యానికి ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ మార్పు కారణమని ఐఎంఎల్ డిపో మేనేజర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.సుబ్బారావు అన్నారు. ఆయన బుధవారం విలేఖరులతో మాట్లా దారు. రవాణా ఛార్జీలను తప్పనిసరిగా చెల్లిస్తామన్నారు. ఛార్జీల చెల్లింపుతో సంబంధం లేనప్పటికీ, సంబంధిత ఏజెన్సీతో మాట్లాడి చెల్లింపులకు చర్యలు చేపడతావ ఉన్నారు. గత ప్రభుత్వంలో తిరుపతికి చెందిన థర్డ్ ఐ ఫెసిలిటేటర్ లిమిటెడ్ సంస్థ ద్వారా అవుట్ సోర్సింగ్ విధానంలో వైన్ షాపుల్లో సూపర్వైజర్లు, సేల్స్మెన్స్ నియామకం జరిగిందని, దీని ఒప్పందం గడువు ఈ ఏడాది జూలై నెలతో పూర్తయిందన్నారు. అవుట్ సోర్సింగ్ విధానంలో నియమితులైన ఈ సిబ్బంది ఇచ్చిన సమ్మె నోటీసు విషయాన్ని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కమీషనర్ దృష్టికి వెళ్లామన్నారు. ఈ విధానంలో నియమితులైన సిబ్బందికి సమ్మె చేసే హక్కు ఉండదన్నారు. సమ్మె వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని, సామరస్యంగా సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. మద్యం ప్రియులు ఎలాంటి ఎలాంటి బ్రాండ్ల మద్యం కోరుకుంటున్నారన్న వివరాలను ప్రభుత్వానికి పంపించామన్నారు. 2019కు ముందున్న బ్రాండ్లను నూతన ఎక్సైజ్ పాలసీలో తీసుకువచ్చే అవకాశం ఉందన్నారు. తక్కువ ధరకే నాణ్యమైన మద్యం అందజేస్తామన్నారు. సెబ్బు ఎక్సైజ్ శాఖలో విలీనంతో జిల్లాలో 12 పోలీస్ స్టేషన్ల పరిధిలో 230 సిబ్బందిని విలీనమవుతారని చెప్పారు. మద్యం షాపుల్లో పనిచేసు న్న సూపర్వైజర్లు, సేల్స్ మేన్లు ఈ నెల7వ తేదీన సమ్మె చేస్తామని నోటీసు ఇచ్చి వాయిదా వేసుకున్నారన్నారు.

## విద్యుత్ అంతరాయం

విశాలాంధ్ర - రణస్థలం : లైనుకు అడ్డుగా ఉన్న చెట్లు తొలగించుటకు మరియు లైన్ క్లియరెన్స్ కొరకు యర్రవరం 33/11 కేవీ పరిధి లో గల 11కెవీ. వి.యన్ పురం ఫీడర్ కు సంబంధించి వి.యన్ పురం, రెడ్డిపేట, మిండిపేట, మరియు నీలంపేట గ్రామాలకు ఈనెల 6వ తేదీ శుక్రవారం ఉదయం 09.00 గంటల నుండి మధ్యాహ్నం 02.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడునని ప్రజలు సహకరించవలసినదిగా విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యస్ బయ్యాన్ నాయుడు ఆపరేషన్ శ్రీకాకుళం డివిజన్ వారు కోరారు.

## పాతపట్నంలో బీజేపీ విస్తరణకు సిరిపురం ప్రయత్నాలు

### పలువురు వైసీపీ ముఖ్యులతో చర్చలు

విశాలాంధ్ర - కొత్తూరు : పాతపట్నం నియోజిక వర్గంలో బీజేపీ పార్టీ విస్తరణకు ఆ పార్టీ సీనియర్ నాయకులు విద్యావేత్త సిరిపురం తేజేశ్వర రావు తన ప్రయత్నాలు సాగిస్తున్నారు. ప్రస్తుతం పార్టీ సభ్యత్వ సేకరణ కార్యక్రమాన్ని సరైన సమయంగా భావించిన బీజేపీ నేత సిరిపురం నియోజిక వర్గంలో ముఖ్యంగా వైసీపీ పార్టీకి చెందిన కొందరు. ముఖ్య నాయ కులను కలుస్తూ బీజేపీ పార్టీలో చేరడం వల్ల సామాజిక, రాజకీయ ప్రయోజనాలను సిరిపురం వారికి వివరంగా చెప్తున్నారు. ఇందులో భాగంగా కొత్తూరు మండలంలో వైసీపీ పార్టీ ఓ ఆరుగురు సర్పంచ్‌లను, మరి కొందరు ముఖ్య నేతలును బీజేపీ సీనియర్ నేత సిరిపురం కలిసినట్లు విశ్వసనీయ సమాచారం రానున్న గ్రామ పంచాయితీలు, మండల పరిషత్ ఎన్నికలు నాటికి బీజేపీని పాతపట్నం నియోజకవర్గంలో కూటమి పార్టీల్లో ధీటైన శక్తిగా రూపొందిస్తాం సమాజంలో వివిధ వర్గాలు వారికి కేంద్రంలో ఉన్న ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఆధ్వర్యం లోగల ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలు మధ్య కూ తీసుకెళ్తం అని బీజేపీ నేత సిరిపురం అన్నారు.

## రామయ్యపట్నంలో జంగిల్ క్లియరెన్స్

విశాలాంధ్ర - సోంపేట : ఈ మండలం తీర గ్రామమైన గొల్లగండి పంచాయతీ రామయ్యపట్నం గ్రామంలో బుధవారం నిట్ట గోపాల్ ఆధ్వర్యంలో పంచాయతీ నిధులతో విపరీతంగా పెరిగిపోయిన జంగిల్‌ను జెసిబి సహాయంతో తొలగించారు. జంగిల్‌తో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

## రైతులను దోచుకుంటున్న ఎరువుల వ్యాపారులు

విశాలాంధ్ర - జలుమూరు : ప్రస్తుత తరుణంలో రైతు సాగు చేస్తూ జీవించడం కష్టమవుతున్న ఈ రోజుల్లో ఇటు వకృతి సహకరిస్తున్నా ఎరువులు అమ్మకాల్లో అనేక మోసాలకు వ్యాపారుల దగాకు రైతులు గురవుతున్నారు. జలుమూరు, సారవకోట మండలాల పరిధిలో ప్రభుత్వ గుర్తించిన విత్తనాలు ఎరువులు అమ్ముకునేందుకు అధికారికంగా 13 దుకాణాల వరకు ఉన్నాయి. ప్రభుత్వం శాస్త్రవేత్తలు లెక్కల ప్రకారం వారి సూచనలతో ఎరువు పంపిణీ చేస్తుంటే రైతులకు చాలీచాలని విధంగా ఉన్నందున అదును చూసి పదును పట్టిన విధంగా ఎరువుల వ్యాపారులు వివిధ రకాల ఎరువులను గొడవనుల్లో నిల్వలు ఉంచలేదని చెప్తుతూ అదనపు ధర లభిస్తే చాటుమాటుగా రైతులకు అందజేస్తున్నారని బాహాటంగా విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఎకరానికి యూరియా 60 నుండి 70 కిలోల ఇవ్వవలసి ఉంది. ఇది శాస్త్రవేత్తలు సూచన మేరకు వినియోగించాలి. ఇప్పటికీ 50 శాతం రైతు సేవా కేంద్రం నుండి సరఫరా జరిగిందని మండల వ్యవసాయ అధికారులు తెలిపారు. 45 కేజీల ఊరియా బస్తా 270 రూపాయలకు ప్రభుత్వం అందిస్తుంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఎకరాకు మూడు దఫాలు ఏ నెలకు సరిపడే ఎరువు ఆ నెలకు అందజేస్తుందని అలా కాకుండా రైతులు ఒక్కసారి నిలువలు చేస్తున్నందున ఎరువుకు డిమాండ్ ఉండవచ్చునని వారు తెలిపారు. ప్రస్తుతం జలుమూరు మండలానికి 400 మెట్రిక్ టన్నులు అవసరం ఉండగా గిడ్డంగులు లేని కారణంగా సరుకు వచ్చేటప్పుడే దిగుమతి చేయాలని అదే సమయంలో రైతు భరోసా కేంద్రాల నుండి పంపిణీ జరుగుతున్నందున ఇటువంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు వాపోతున్నారు. గత ఐదు రోజులుగా కురిసిన వర్షాలకు రైతులు ఎరువు కోసం ఆందోళన చెందుతున్న పరిస్థితులను చూసి చాలామంది ఎరువులు వ్యాపారులు నచ్చిన విధంగా అమ్మకాలు చేస్తున్నారని సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు విజిలెన్స్ అధికారులు దీనిపై నిఘా వేసి రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

## కళాశాల పూర్వ విద్యార్థులు యూనిఫామ్స్ వితరణ

విశాలాంధ్ర - రణస్థలం : రణస్థలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1992 సంవత్సరం నుండి ఇంతవరకు చదువుకున్న ఒకేషనల్ విద్యార్థులు ఈఏడాది మొదటి సంవత్సరం చదువుతున్న 30 మంది ఒకేషనల్ విద్యార్థులకు రెండు జతలు చప్పున యూనిఫామ్స్‌ని బుధవారం కళాశాలలో అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జె.విజయలక్ష్మీ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేయడం చాలా అభినందనీ యమన్నారు. ఈకళాశాలలో గత 30 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఒకేషనల్ అధ్యాపకులు కె.జగదీష్ పాత్రో, వై.శ్రీనివాసరావు ఈ కళాశాలకు పునాదులని కళాశాల అభివృద్ధికి, విద్యార్థులను కళాశాలలో చేర్పించేందుకు, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో ముందు వరుసలో ఉంటారని వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ మేము ఎన్నో రంగాలలో స్థిరపడ్డామని, చదువు విలువ తెలిసిన వాళ్లమని, తాము చదువుకున్న కళాశాల రుణం తీర్చుకోవాలనే సంకల్పం చేసుకొని అందరం డబ్బులు సేకరించి యూనిఫామ్స్ అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కళాశాలలో చదివే విద్యార్థులు ఆర్థికంగా వెనుకబడిన వాళ్లు ఉంటారని, తాము చదువుకున్న కళాశాల విద్యార్థులకు సహకారం అందించడం ద్వారా పిల్లల్లో పోటీతత్వం పెంచి తద్వారా వారి భవిష్యత్తుకు బాటలు వేయాలనే సంకల్పంతో పూర్వ విద్యార్థుల సహకారంతో యూనిఫామ్స్ అందించామని పేర్కొన్నారు. అలాగే పూర్వ విద్యార్థి డి.కుమారస్వామి కంప్యూటర్ అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరావు, బి.సురేంద్ర, పూర్వ విద్యార్థులు, అద్యాపకులు పాల్గొన్నారు.

## అనాథ వృద్ధురాలికి ఆశ్రయం

విశాలాంధ్ర - సోంపేట : సోంపేటకు చెందిన సీతయ్య ఫౌండేషన్ కవిటి మండలం కుసుంపురం పంచాయతీ గుసురుపుట్టుగ గ్రామానికి చెందిన అనాథ వృద్ధురాలు గుసురి జోగమ్మకు బుధవారం ఆశ్రయం కల్పించింది. ఆమె శేష జీవితానికి భరోసా ఇస్తూ అన్ని విధాలుగా ఆమెకు సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొంటూ నిర్వాహకులు గుల్ల మోహన్, రమేష్ సోదరులు పేర్కొన్నారు. ఫౌండేషన్‌కు విరివిగా సేవలందిస్తున్న సానా గణేష్ ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

## ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్‌కు పూర్వ విద్యార్థులు భోజనశాల ఏర్పాటు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : జిల్లాకి తలమానికమైన ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు స్కూలు అభివృద్ధి కోసం చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ తిరుమల చైతన్య అన్నారు. విద్యార్థుల కోసం ఒక భోజనశాలను ఐదున్నర లక్షల వ్యయంతో నిర్మించడం హర్షదాయకమని, భోజనశాలను ప్రారంభిస్తూ ఆయన అన్నారు. స్కూలు విద్యార్థుల సంఖ్యను పెంచే కృషి కూడా చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సంపాదించడం కన్నా ఉన్నంతలో సమాజానికి మనం ఏమి ఇచ్చాము అనే అంశం మనిషిని ఉన్నతుడిని చేస్తుందని ఆ దిశలో పూర్వ విద్యార్థుల సంఘం చేస్తున్న కృషి అభినందనీయమని పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పాగిరి సుగుణాకర్ రావు అన్నారు. స్కూలు అభివృద్ధి కోసం విద్యార్థులకు ప్రోత్సాహాలు అందించడం, ఉపాధ్యాయులకు అన్ని విధాల అండదండలు అందిస్తూ పూర్వ విద్యార్థులు చేస్తున్న కృషి తమకెంతో నూతన ఉత్సాహానిస్తున్నదని ప్రధానోపాధ్యాయులు సిహెచ్. దేవ దత్తానంద్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పాఠశాల బోధనా సిబ్బందికి అభినందనలు తెలియజేస్తూ డీఈవో చేతుల మీదుగా సత్కరించడం జరిగింది. తరగతి గదిలోనే దేశ భవితవ్యం నిర్మితమవుతుందన్న పండిట్ జవహర్లాల్ నెహ్రూ భావనతో తాము పూర్తిగా ఏకీభవిస్తామని, ఎందరో మహానుభావులను జాతికి అందించిన ఈ పాఠశాలలో మరింత విశిష్టమైన వ్యక్తులు తయారయ్యేలాగా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సంఘం అధ్యక్ష కార్యదర్శులు వి.జి కే మూర్తి, జామి భీమశంకర్ రావు విజ్ఞప్తి చేశారు. ఈ భావాన్ని వ్యక్తీకరించే ఒక గీతాన్ని సభలో వినిపించారు. పాఠశాల పూర్వ విద్యార్థులు వివిధ బ్యాచులకు చెందిన వారు పెద్ద సంఖ్యలో ఉత్సాహంతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం గురజాడ దేశభక్తి గీతాన్ని సామూహికంగా ఆలపించడంతో ప్రారంభమై, వందన సమర్పణతో ముగిసింది. సంఘం నాయకులు పేర్ల కామరాజు, పాలిశెట్టి మల్లిబాబు, ఢిల్లీ భాస్కరరావు, చెబోలు బాబ్జి, కె.ఫల్గుణరావు, కె.ఎల్.ఎన్. మూర్తి, ఎం.శ్రీనివాసరావు టి.బాలమురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## తుఫాన్ బాధితులకు అండగా శ్రీకాకుళం లయన్స్ క్లబ్

### ప్రశంసించిన జిల్లా కలక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : తుఫాన్ బాధితులకు అండగా లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అండగా నిలవటం హర్షణీయమని, ముందస్తు సేవలకు, నిస్వార్థ సేవలకు చిరునామ లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అని జిల్లా కలక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. రాష్ట్రమంతా వరదలతో బాధపడుతున్న బాధితుల సహాయార్థం మంగళవారం రాత్రి రూ.25 వేలు చెక్కు సిఎం రిలీఫ్ ఫండ్ కు లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అందజేయడం గొప్ప విషయమన్నారు. ప్రతి రోజూ పలు పత్రికలలో వస్తున్న నిత్య సేవా కథనాలను చూస్తున్నామని, నిరంతర నిస్వార్థంగా సేవలు కొనసాగించాలన్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణ బాధ్యతను తీసుకోవాలని, విద్యార్థులకు, ప్రజలకు ఉపయోగాడే అవగాహన కార్యక్రమాలను సైతం నిర్వహించి అందరిలో చైతన్యం తేవాలన్నారు. ఈ కార్రక్రమంలో లయన్స్ క్లబ్ సెంట్రల్ మెంటర్ నటుకుల.మోహన్, మార్కెటింగ్ ఛైర్పర్సన్ ఉర్లాం. శివతేజ, సభ్యులుగుత్తు. చిన్నారావ్, డా.పైడి. ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.